# గుళ్లో గంటలు

చిన కోడూరు ఇంకా కళ్లు తెరవని పసికందులా వుంటుంది.

ఆ వూరి జనం అంతా వుత్త గంగిగోవురకం! ఇంత అమాయికతకు కారణం ఆవూరి వునికే సుమా! అంటే? దాని నైసర్గిక స్వరూపం పరిసర ప్రభావం అలాంటిది.

మూడువైపులా గుట్టలు, అవే, రెడ్డి గట్టు, కోటగట్టు, కొండగట్టు, తూర్పున వక్రించిన బస్తీ వాతావరణ కాలుష్యానికి ప్రతీకగా, గుప్పు గుప్పున పొగలు చిమ్ముతూ 'కూ' అంటూ వచ్చీ, పోయే రైళ్ల నడకకు అనువైన రైలు కట్ట. అయినా రైలు స్టేషన్ ఆ వూళ్లో లేకుండా వూరికి నాలుగు మైళ్ల దూరంలో వుంటుంది.

ఈ రైలుకట్ట వెనుకే వావిలి పొదలు, ఆ పొదల వెంబడే 'వూర చెరువు' దాన్ని ఆనుకునే కోటగట్టు తాలూకు బండరాళ్లు. ఈ 'కోట గట్టు' పేరును సార్థకం చేస్తూ అక్కడో అపురూపమైన కోటకూడా వుంది. అది, కాకతీయులకాలం నాటి 'కోట' అంటూ జనం చెప్పుకుంటారు. ఈ కొండగుట్టల్లో పుట్టిన గడ్డీ, ఆకూ, అలం, పువ్వూ, పండు, మందూ మాకూ అంత, అక్కడి జనానికి జీవనాధారం. వర్షాకాలం వానలు వెనుక ముఖం పట్టి నీటి ఎద్దడి ఏర్పడ్డప్పుడు వూరి జనం అంతా యిక్కడ అవ్వారిగా పండే సీతాఫలపు పండ్లకోసం ఈ గట్టుకు ఎగబడ్తూ వుంటారు. పలికిన అంటే పక్వానికి వచ్చిన ఈ కాయలను కాల్చి తింటారు. అవి చాలా రుచిగా కూడా వుంటావి. శరీరానికి అవసరమైన పిండి పదార్థాన్నీ విటమిన్ 'సి' ని, చక్కెరను యిస్తాయి.

ఈ కోట కొమ్ము భాగంలో వో జలప్రవాహం వుంది. ఆ నీళ్లు అమృతోపమానంగా వుంటాయి. ఆ ప్రాంతం ఎలుగుబంట్లకు ఏలుబడి స్థానం. తమకు సామంతులైన పసుల పిల్లలు (పశువుల కాపర్లు) వెంటలేనిదే ఎవ్వరినీ ఆ ఎలుగుబంట్లు ఆ దరిదాపులకు కూడా చేరనివ్వవు. ఆ వూరి పసుల పిల్లలతో పెదకాపు రామయ్య కూతురు సీతమ్మ, పూజారి కూతురు జానకమ్మకూ ప్రవేశార్హతలున్నాయి. అంతే కాదు, గురుశిష్య సంబంధమూ వుందేమో?

ప్రతినిత్యం మణిశిలాకల్లా వున్న యీ యిద్దరమ్మాయిలు, అడవి ప్రాంతాలకు వెళ్లి, మోదుగు ఆకులూ, అడవి పువ్వులూ, పళ్లూ, తెచ్చి, గుళ్లో స్వామి కైంకర్యానికి అవసరమైన విస్తళ్లు, దొన్నెలు మాలలూ, కుట్టీ కట్టి యిస్తుంటారు. ఇది ఆ పల్లెలో దినచర్య.

ఇలాంటి ఆవూరికి వోనాడు 'చూడు చూడు చుక్కరాలె' నంటూ వో అందమైన యువకుడు, నవనాగరికమైన వేషభాషలతో కొత్తగా కనిపిస్తూ ప్రవేశించాడు.

ఈ యువకుడి రాకను ఎవ్వరూ గమనినంచినట్లే లేదు. ఎవరిలో వులుకూ పలుకూ లేదు. ఎవ్వరి పనులల్లో వారు నిమగ్నులు.

కాలువ గట్టు వెంబడి పుష్కలంగా పెరిగే వుత్తరేణి, గుంట గర్జెరు, పొన్నగంటి, గంగవాయిలు, సన్నవాయిలు, అట్కవాయిలు ల్లాంటి ఆకుకూరలేరుకుని ఆడపిల్లలు వొడినింపుకుంటున్నారు. మగపిల్లలంతా, వుల్లింత, వూడుగ తునికి పళ్లు రాల్చుకు తింటున్నారు. ఆ పక్కనె వున్న మడుగులోంచి దుంపగడ్డలు త్రవ్వి మరికొందరు తీస్తున్నారు.

ఇదంతా చూస్తూ ఆ కొత్తవ్యక్తి యింకో పదిగజాల దూరం నడిచేవరకు, వూళ్లో పడి సందుగొందుల్లో దాగిన పిల్లులను ఏరేరి చంపుతూ, చంపిన వాటిని దివిటీల్లా సువ్వలకు వ్రేలాడదీస్తూ ఎరుకలవాళ్లు ఎదురుపడ్డారు.

అలాగే మరో దొమ్మరి తన జోలెలో వో రెండు పంది కొక్కులూ, వో దోసెడు ఎలుకలను వంకాయలు, సొరకాయల్లా కుక్కుకుని పోతూ కనిపించాడు. ఇలా ఈ వూళ్లో ఎరుకలూ, దొమ్మర్ల పుణ్యమా అంటూ పంటను పొట్టన బెట్టుకునె, ఎలుకా, పందికొక్కంటూ, వూదర్లు పెట్టి వుడ్కిపోవలసిన యిబ్బంది ఆ వూరి వారికి తప్పింది.

ఈ దృశ్యాన్ని చూస్తూ త్రోవలోనే హడలి పోయాడు కొత్తగా కాలుపెట్టిన యువకుడు. ఆయనే రఘు.

ఇంతకూ ఈ వూళ్లో జనం మానుషీభాషలో మాట్లాడుతారా? కాక ఏదో గ్రహం నుండి వూడి పడిన జీవుల్లా అమానవీయమైన ఏదో భాషలో భాషిస్తారా? అనే సందేహం కూడా కలిగింది. దాంతో తాను ముందుకు సాగి పోవడమా? కాక వచ్చిన దారినే వెనక్కు తిరిగి వెళ్లడమా? అంటూ కింకర్తవ్యతా మూఢ బుద్ధితో నిల్చుండిపోయాడు.

ఇలా,వో రెండు నిమిషాల పాటు ఆలోచనలో గడిపే సరికి, రఘు దృష్టికి ఆంజనేయస్వామి గుళ్లో ఆరగింపు చేసి తీర్థప్రసాదాలతో యింటి ముఖం పట్టి నడిచి వస్తున్న పరంధామయ్య కనిపించాడు. దాంతో 'ఒహో! మన వాళ్లు కూడా వున్నారు. పరవాలే'దన్న ధైర్యం కలిగింది రఘుకు.

పలుకరించాడు. కావలసిన సాయం అడిగినట్లున్నాడు. సంతోషంగా పరంధామయ్య గారు వచ్చిన అతిథిని వెంటబెట్టుకుని సరాసరి రామయ్య గారింటికే వచ్చాడు.

అలా వో కొత్త మనిషిని వెంట బెట్టుకుని వచ్చిన పరంధామయ్యను చూస్తూనే పలకమంచంపైనుండి లేచి ఎదురువస్తూ ' ఏమయ్యా పంతులు! అంత బాగేనా? అంటూ ఆప్యాయంగా పలుకరించి వెంటవున్న వ్యక్తిని చూసి ' ఈ కొత్త పిల్లగాడెవరయ్యా? మంచి ఆర్భమైన కోడెలా వున్నాడు' అంటూ తన ఎదకు దగ్గరైన వుపమానంతో పోలుస్తూ ప్రశ్నిస్తూనే, ఆ వైపుకు తిర్గి ఆఁ తల్లీ! సీతయ్యా! వో రెండు పెద్ద గిలాసలల్ల మీగెడపాలు పట్కరా? అంటూ కల్లాకపటం లేని తెల్లటి మనస్సుతో ఆదరించాడు.

అలాంటి నిండైన వ్యక్తిని చూచి 'అహో! ఆశ్చర్యం' అంటూ దేవభాషలో అభినందించాలి, అన్నంత హృదయ స్పందనం కలిగింది రఘుకు.

నిజానికి రామయ్య అంతటి వాడే! అసలు సిసలైన మనిషి.

రఘు, ఈ వూరికి శోభాయాత్రకైరాలేదు. ఈ మధ్యలో జానపద విజ్ఞానం సంతరించుకున్న గుర్తింపు ఆధారంగా దేశవిదేశాల్లో తత్సంబంధమైన పరిశోధనలు ప్రారంభమయ్యాయి. ఈ కాలంలో అన్ని రంగాల్లో అసలును అణగదొక్కి కుక్కమూతి పిందెలు వెర్రితలలు వేస్తున్నట్లే జానపద సంస్కృతిలో కూడా ఫోక్ కన్నా ఫేక్ ప్రాబల్యం ఎక్కువైంది. అందువల్ల, అసలు సిసలైన మణుల నుండి గాజు పూసలను ఏరిపారవేసి అచ్చమైన జానపదరీతులకు అద్దం పడ్తూ పత్రసమర్పణ చేస్తానంటూ, విశ్వవిద్యాలయంనుండి అధికారకపత్రాలతో సహా యీ వూరొచ్చాడు రఘు.

ఊరికల్లా శిఖరాల్లాంటి అయిద్దరినీ కలిశాడు. ఆ తరువాత ఏ పరిచయపత్రంతో పనేలేకపోయింది. ఆ వూరిలో తనను పరాయిగా చూస్తూ శంకించిన వారే కనిపించలేదు.

అతిథి సత్కారం ఆ వూరి నెత్తురులో వున్నట్లుంది. అది ఆ పల్లె జీవితానికి జీవనాడి వంటిది. అంటూ గ్రహించడానికి రఘుకు ఎంతోకాలం పట్టలేదు. గ్రామ పెద్దలిద్దరూ అడక్కుండానే అన్ని వసతులూ కల్పిస్తున్నారు. వ్యక్తిగత సౌకర్యాలు రామయ్యగారు చూస్తే, పరిశోధనకు అవసరమైన వస్తుసంచయాన్ని పరంధామయ్యగారు సమకూరుస్తున్నారు.

వోనాడు పరంధామయ్య రఘును ఆంజనేయస్వామి గుడికి తీసుకు వెళ్తాడు. అక్కడ కావించే నిత్యనైమిత్తిక పూజాదుల విశాషాలే కాకుండా కైంకర్యంలో భాగంగా జరిపే సింధూరాలంకరణ, ఎర్రగన్నేరు పూల ప్రత్యేకత, వూపే చామరం, పట్టే ఛత్రం, వెలిగించే కర్పూరం, పాడే మేలు కొలుపుల ప్రత్యేకతలను గూర్చి వివరిస్తాడు.

అంతేకాదు పైకి మూఢనమ్మకంగా కనిపించే మొక్కుబడులు, కానుకలు, భోగాలవంటి సంప్రదాయసిద్ధమైన ఆచారాల వెనుక దాగిన రహస్యాలను గూర్చి వివరిస్తూ అందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా కోరికలు పండిన భక్తులు సమర్పించిన వెండి కండ్లు, వెండి తొడుగు, పాదుకలు, మొదలైన సమర్పణలను దర్శింపచేస్తాడు.

అట్లాగే సంప్రదాయసిద్ధంగా ఆ వూళ్లో భక్తులు ప్రతి ఏటా నియమంగా 'కార్తీకాలు' కట్టిస్తుంటారంటూ ప్రారంభించగానే 'కార్తీకం కట్టడం ఏమిటీ ? 'కార్తీకం' సంవత్సరానికున్న

పన్నెండు నెలల్లో వో నెలపేరు కదా? మరి దానిని కట్టించడం ఎలా పొసగుతుంది? కాక పీతాంబరంలా అదేదో వస్త్రవిశేషమై వుంటుందా? అంటూ సందేహావస్థలో పడ్డాడు.

అది గ్రహించిన పరంధామయ్య నవ్వుతూ - అబ్బాయ్! 'కార్తీకం కట్టించడం' అనగానే యిదేదో వింతజంతు సంబంధిగా ఆలోచించకు. సంకీర్ణపు నాగరికతలకు కూడలి పట్టైన పట్టణ వాసాల్లో జీవిస్తున్న మీలాంటి విద్యావంతులకు దేశీయమైన మన ఆచార వ్యవస్థ తెలియదు. అందుకే విస్తుపోతున్నావ్.

కార్తీకం కట్టించడమనేది పల్లెవాసులకు ద్విపదదాయకమైన వేడుక. ఇందులో కళాభివ్యక్తికీ, భక్తికీ, చోటుంటుంది. కార్తీకమాసంలో ఆంజనేయస్వామి గర్భగుడినీ, ఆలయ ప్రాంగణాన్నీ, తమలపాకు తోరణాలతో అలంకరించి, ఆముదపు దీపాలు వెలిగించి జరిపే వేడుక. ఈ నెలరోజులూ తప్పని సరిగా ప్రాతః సంధ్యలు రెండింటా దీపారాధనం జరుగుతుంది. నిత్యార్చనలే కాకుండా విశేష పూజలూ, అష్టోత్తర, సహస్రనామార్చనలూ వుంటాయి. తీర్థప్రసాదాలేకాకుండా పేదవారికి అన్నదానం జరుగుతుంది. రాత్రి భజనలు చేస్తారు. కీర్తనలు కట్టి భజన పరులంతా జట్టులుగా ఏర్పడి వుత్సాహంతో పాడ్తారు. సంపన్నులైతే ఒకనాటి ఖర్చును ఒక్కరు భరిస్తే, తక్కిన వారు రెండు మూడు కడపల వారుగా చేరి ఈ వేడుకలు నిర్వహిస్తారు. ఈ రోజుల్లోనే అప్పుడప్పుడు సప్తాహ, సమారాధనోత్సవాలు కూడా జరుగుతాయి. అప్పుడు 'రామపట్టాభిషేక' హరికథ తప్పదు.

ఈ సందర్భంలో అశోకవనిలో వున్న సీతమ్మను ఆనవాలు పట్టి హనుమంతుడు రామ ముద్రికను సమర్పించిన దృశ్యాన్ని ప్రదర్శిస్తారు. గర్భగుడిలో సింధూరాలంకృతుడైన స్వామి సాక్షాత్తు విగ్రహరూపాన్ని పొందిన సంకటహరుడైన ఆంజనేయుడిలానే ప్రకాశిస్తాడు' అంటూ పరవశించి చెబుతూ వుంటే అంతకన్నా పారవశ్యంతో చెప్పిందంతా చిత్రకథలా వ్రాసుకుంటున్నాడు రఘు.

ఉన్నత విద్యావంతుడైన రఘులో కన్పిస్తున్న శ్రద్ధాసక్తులూ, వినయ విధేయతలూ అన్నీ చూస్తూవుంటే పరంధామయ్య ముగ్ధుడై పోతున్నాడు.

ఆలయానికి తనవెంట రఘును తీసుకువచ్చిననాటి నుంచీ పరంధామయ్య మనస్సులో వో కోరికేదో, తలెత్తి, తబ్బిబ్బు చేస్తూ వుంది.

తన స్వామి పక్కన తలవొంచి వ్రాసుకుంటూన్న ఆ పిల్లవాడెంత సుందరంగా కనిపించాడో? ఆ అబ్బాయి ముఖంలో వర్చస్సు కొట్టవచ్చినట్లుగా వుంది. అంతే కాదు ఆ వ్యక్తిలో ఏదో దైవీశక్తి వుంది. వ్రాస్తున్న ఆ చేతిలో ఎంత వొడుపు, మనస్సులో ఎంత శ్రద్ధ? ప్రవర్తనలో ఎంత సభ్యత? ఇలాంటి పిల్లవాడు నాకు అల్లుడైతే? అంటూ తీగెలు సాగుతున్న ఆలోచనలను నిరోధిస్తూ 'ఏమిటీ గొంతెమ్మ కోరిక? ఆంజనేయస్వామీ! అపచారం మన్నించండి' అంటూ చెంపలు వేసుకుని దీనికి పరిహారంగా పస్తుండి మనస్సును శాసిస్తానంటూ' ఆ పూట భోజనం మానేశాడు.

ఓ వారం తిరక్కుండానే ఆ వూరికి రఘుపాతకాపు లా మారిపోయాడు. ఆ వూరి వ్యవస్థ, కట్టుబాట్లు చూస్తున్న కొద్దీ రఘుకు తల తిరిగిపోతూవుంది. అక్కడ ఎవ్వరూ ఎవ్వరినీ శాసించరు. కానీ, అప్రత్యక్షమైన అద్భుత దండం ఏదో అందరినీ క్రమశిక్షణలో నడుపుతుంది. ఋతుసత్యాలవలె ఆయాకాలాల్లో ఆయా పనులు జరిగిపోతుంటాయి. ఆయా వృత్తులవారు, వారివారికి రావలసిన భాగాలను లెక్కగా పంచుకుంటారు.

పూజారి ఆ వూరికి ఏడుగడ, పోరాని చుట్టం. ఆపతి సంపతిలో అండగా వుంటాడు. మాంత్రికుడై తేలుమంత్రం వేస్తాడు. పాము విషం దింపుతాడు. వైద్యుడుగా రోగాలు నయం చేస్తాడు. గురువై చదువు నేర్పుతాడు. పురోహితుడై పెళ్లిళ్లు చేయిస్తాడు. పూజారిగ దేవతార్చన చేస్తాడు.

పెద్దకాపు రామయ్య వూరంతటికి తలమానికం. అందరి నయభయాలకు పట్టుగొమ్మ. పేరు చెబితే చాలు పారే పామైనా నిలుస్తుంది. అయినా ఆకలికొన్న కడుపును వూరికే చూడడు. అందుకే జీవనోపాధి కరువైనప్పుడు తమ కళను ఆదరించి కలో? గంజో? కల్పించకపోతాడా? అంటూ ఆరబైండ్లు, దొమ్మర్లు, పిచ్చకుంట్లు, పగటేశకాండ్లు అందరు ఆ వూళ్లో నివాసం ఏర్పరచుకుని వుంటున్నారు.

మరోనాల్గు దినాలయ్యేసరికి వూళ్లో 'కురవ' నాగప్ప కొడుకు పెళ్లొచ్చింది. కురవలు, తమ యింట్లో జరిగే పెళ్లికి ముందు 'బీరప్ప' కథ చెప్పించుకోవడం పరిపాటి. ఆ తరువాత పెళ్లి సంబరం నడుస్తుంది. పెళ్లికన్నా సంబరంగా జరిగే వేడుక తక్కెడ గుండు. ఈ సంబరంలో పెళ్లి తరువాత బంధువులందరూ దేవాలయం చేరి ఆ మండపంలో పిల్లవాడి మేనమామ పిల్లనూ, పిల్లమేనమామ పిల్ల వాణ్ణీ ఎత్తుకుని 'డిల్లెం కల్లెం' అంటూ చిందులేస్తారు. ఈ జంటతో పాటు కొత్తగా పెళ్లైన వాళ్లు తమ తమ భార్యలను ఎత్తుకుని తక్కెడ గుండు తొక్కుతారు. ఇది అంత నాజూకు అనిపించకపోయినా, నిసర్గసుందరమైన జానపదుల మనస్తత్వానికీ, నిరాడంబరమైన వారి జీవనరీతికీ అద్దం పడ్తూ వినోదాన్ని వడ్డిస్తుంది.

ఇదంతా చూస్తూ రఘు తనకు పెన్నిధి లభించినట్లూ, తానేదో జానపద విజ్ఞానం మొలిచిన వీధుల్లో సంచరిస్తున్నట్లు భావించి పట్టరాని సంతోషంతో విషయ సేకరణ ప్రారంభించాడు.

అలాగే ఆ పల్లెలో సర్వసాధారణంగా జరిగే పురుడూ, బారసాలల్లాంటి చిన్న చిన్న వేడుకలు కూడా రఘుకు ఆశ్చర్యాన్ని కల్పించాయి. ప్రతి వేడుకలో ప్రతి ఒక్కరికీ స్థానం వుంటుంది. వైద్యం అనే పేరు లేకుండానే ఆచార గర్భితమై యీ తతంగం అంతా నడుస్తుంది.

ఈ విధంగానే 'గండదీపం మోయడం' బొడ్రాతి దగ్గర పరమాన్నపు బలి సమర్పించడం, బాలెంతరాలు ఇరవై ఒక్కరోజున 'నీళ్ల కెళ్లడం' బావికట్టపై లింగాలు కట్టడం, ఆ లింగాలను నవధాన్యాలతో పూజించడం, విచిత్రమైన ఆచారంగా రఘు దృష్టిని ఆకర్షించింది.

ఈ లింగాలు అంటే అయిదు పలుగురాళ్లను శుభ్రం చేసి దేవతా రూపాలుగా అర్చిస్తారు. ఇవి పంచవక్త్రుడైన శివుడికీ, మాతృకా రూపంలో వున్న బాల గ్రహాలకూ ప్రతీకలై వుండవచ్చు.

అట్లాగే సరిహద్దు దేవతను పరాయి వూరికి వెళ్లేప్పుడు తప్పక పూజించాలి. ఆ పూజను 'పొలిమేర కట్టడం' అంటారు. ఈమె త్రికోణాకారంలో వుండే శిలాఫలకం.

బాలగ్రహాలను 'బాలమ్మ' అనే పేరుతో ప్రతి యింటా పూజిస్తారు. ఈ బాలమ్మ చెక్కబొమ్మ. ఈమె అనుగ్రహం వల్లే పిల్లలు బాలారిష్టానుండి కాపాడబడుతారనే నమ్మకం గట్టిగా వున్నవారు ఆ పల్లెవాసులు.

ఇట్లే గంపజాతర (అంటే వనభోజనం) ఎల్లమ్మ బోనం, పెద్దమ్మ కొలుపు, అనే నైమిత్తక పూజా విధులన్నీటినీ సవివరంగా వ్రాసుకున్నాడు.

తను సేకరించ దలిచిన దాని కన్నా నానా విషయకమ్మైన విజ్ఞానం అధికంగా లభిస్తూ వుంటే తృప్తిగా వో నెల రోజులు గడిచాయి.

ఇలా ఈ వూళ్లో జరుపుకునే గృహసంబంధమ్మైన వేడుకలూ, సంబరాలూ, పండగలూ అన్నీ పరిశీలిస్తూ తనకు, ప్రత్యేకంగా జానపద రీతిగా భాసించిన విశేషాన్ని జాగ్రత్త పరచుకుని, కొండప్రాంతాన్ని చూస్తానంటు కోట గట్టుకు బయలుదేరాడు.

కొంత దూరం సాగుతూ అలుగు దుమికే చల్లని ప్రదేశానికి చేరుకోగానే, అదే దో భూతల స్వర్గంలా అనిపించింది. కానీ పుణ్యఫలం చూసి చిత్రగుప్తుడు చీటీ యివ్వనిదే స్వర్గద్వారాలు తెరుచుకోని పోలికన గుర్తింపుకార్డు లేని రఘు ప్రవేశాన్ని అడ్డగిస్తూ కొండెంగలు కోట బురుజులు కాస్తున్న పంతగార్లలా చెట్లకొమ్మలపై నుండి బెదిరిస్తున్నాయి.

ఏమిటీ చేయడం? అంటూ? అటూ యిటూ చూస్తు ముందుకు కాలు మోపడానికి సిద్ధంగా వున్న రఘును పెనుగాలి వచ్చి తాకినట్లు 'ముందుకు కాలు పెట్టొద్దు'! అంటూ వో శబ్దం వినిపించింది. అలా చెప్పింది ఎవరో కాదు, సీత.

వెంటనే వెనుదిరిగి ' ఏం? సీతా? ముందుకు వెళ్లకుండా నన్నెందుకు ఆపావ్?' అంటూ ప్రశ్నించాడు రఘు.

'ఆఁ ఏమీలేదు, కొండెంగలను లెక్క చేయకుండ ముందుకు చొచ్చుకపోతే నాగలిదోలి గొర్రుగొట్టినట్లు, కొత్తమనిషి మీదవడి గోళ్లగీరి నెత్తురు మడుగులు వారిస్తాయి. అటెంక కల్లుదాగి మస్తులున్న గుడ్డెలుగులు లేస్తే మనిషి బత్కడు. కష్టం. అందికె వొద్దన్న అంట, తన వొళ్లో నుండి వోజామపండు తీసి తాతా! యిదో! తీస్కో!' అంటూ వో పండిచ్చింది కొండెంగకు.

అది తీసుకుంటూ; వొచ్చినవాడు తన సీత చుట్టమే అంటూ కొండెంగలు దారి విడిచి వెళ్లిపోయాయి.

ఈ వింతను చూచిన రఘు, చిలిపిగా సీతను చూస్తూ 'సీతా యీ కొండెంగ నీ: తాతనా? అంటూ నవ్వు ఆపుకోలేక ప్రశ్నించాడు.

· ఆ మాట విన్న సీత, చెంపకు చేరెడుగా ఆక్రమించిన తన కాటుక కళ్లను మరింత పెద్దవిగా చేస్తూ, రోషం, సిగ్గూ రెండూ కలిసి నునులేత బుగ్గలకు కెంపులు అలంకరిస్తూ వుంటే, పసిపిల్లలా బుంగ మూతి పెట్టి.

అవును, కొణెంగి, మా తాతనే! అయితేంది? అంటూ ఘాటుగా ప్రశ్నించి వెంటనే కళ్లు కిందికి దింపుకుంది.

అప్పుడప్పుడే చిరుత ఎండలు శ్యామలమైన వనశోభ చెక్కిళ్లకు తారళ్యం అద్దుతూ వున్న వేళ సెల ఏటి పక్కన జీడిమామిడి చెట్టుకింద నిల్చిన సీత సాక్షాత్కరించిన వనదేవతలా కన్పిస్తూవుంది.

ఎప్పుడూ లేని తియ్యటి కదలిక ఏదో రఘు, దిటువైన ఎదలో ప్రారంభమైంది. ఇంకా దాని ప్రభావానికంతగా లొంగని, రఘు మరింత వేళాకోళంగా నవ్వుతూ, 'సీతా! యీ కొండెంగలు, నీకు తాతలు ఎలా అయ్యారు?'

ఆ ప్రశ్నకు సీత యీ మారు ఎంతో సిన్సీయరుగా సమాధానం చెప్పడం ప్రారంభించింది. ఈ మారు కళ్లల్లో సిగ్గులు కానీ, చెక్కిళ్ల మీద చెందిరపు వన్నెలు కానీ, తొణకకుండా అమాయికత జమిడి రెప్పల కళ్లల్లో దోబూచులాడుతూ వుంటే -

'ఆఁ నిజంగనే, యీ కొణెంగలు, మాకు పూర్వం పెద్దలంట! ఎన్నటికి వానదేవుడు సల్లంగ సూడక పోయేట్యాళ్లకు ఆకాశమంత పెద్దపెద్ద మొగుళ్లు వడుడే దప్ప, వానలు గుర్శింది లేదంట. ఇట్ల వానలు తప్పిచ్చుడు ఒక ఏడు, రొండేండ్లు గాదంట, ఆఁ! వొర్సగ మూడు ఏండ్లు వానలు గుర్వలేదు. వూళ్లమంది భారతం ల విరాటపర్వం జదివిచ్చినగని, కప్పతల్లిని కంట్లంగట్టి అంటే? మెడకు దారం గట్టి యాళ్లాడదీసి 'కప్పతల్లి నీళ్లాడె! కడ్వలన్ని నీళ్లాయె! శాపతల్లి నీళ్లాడె! చెర్వులని నీళ్లాయె! నంట తిప్పినగని, ఒక సుక్క వానబొట్టు రాలలేదంట.

ఇంగ పుష్కలంగ నిండుకున్న యీ అలుగూ, వూర చెరువూ, సేదురుబావులూ అన్ని నీళ్లు అడ్గులు వట్టి వొట్టి పోయినయంట. అప్పుడు పాపం, మా నిజంగ తాతలు; పులిమీద పుట్రోలె, పసులు జచ్చి, సేండ్లు ఎండి, తిండికి గింజ కరువై, ప్రాణాలు కండ్లల్ల పెట్టుకోని బత్కుతుంటె, సర్కారోళ్లొచ్చి, పన్నుగట్టాలె అన్నరంట. అప్పుడు పాపం మావోండ్లు వున్న బూములూ, యిండ్లు పన్ను కిందికీ, జుర్మానా కిందికి జమగట్టి వున్న వూళ్లిడ్సి పొయ్యేటందుకు మనసురాక, సిగ్గుకు ఆమిదం ప్రమిదలు మొకాన బోర్లిచ్చుకోని, ఎడ్లను అదిలిచ్చె చెర్లకోలలు తమ ఎన్క జెక్కుకోని కోతులోలె అడువుల పొంటి పోయిన్రంట.

అయితే అడువులల్ల కోతులు తోకలు వెట్టుకోని అప్పటికే శాపింం జేస్తుండినయిగదా! అందుకోసం యివేందో కొత్తరకం కోతులు అంట అడ్గితే, మా వొండ్లేమొ 'మేము కొణెంగలం' అన్నరంట. ఇంగ అకాణ్ణుంచి మా తాతలు సెట్లూ, గట్లూ వట్టి, కోతులోలె బత్కంగ, బత్కంగ, కొన్నాళ్లకు జతలు గల్సి యీ కొండెంగలు వుట్టినయంట. ఇవే మీరంటున్న కొండముచ్చులు! మా ఎన్కటి తాతలు' అంటూ చెప్పి, రెండు కండ్లెత్తి ప్రసన్నంగ రఘు ముఖంలోకి సూటిగా చూచింది.

ఆ చూపుల వేడిని రఘు తట్టుకోలేక పోయాడు. మదనుడు సుసజ్జితుడై ఎడాపెడా బాణాలు వేస్తూ వుంటే రక్షణకోసం సీత మరుగు చేరుదామనుకున్నాడు. ఏమీ తోచక 'తన వజ్రకవచాన్ని భేదిస్తున్న ఆ చూపు ములుకులనుండి తప్పించుకుంటూ సీత రెండు కళ్లనూ ముద్దుపెట్టుకోవాలి అన్నంత తీవ్రమైన కోరికతో చలించాడు.

కానీ సంస్కారం ఆ పని చేయనివ్వలేదు.

ఇంతలోకే జానకి, సీతను వెతుక్కుంటూ వచ్చి 'సీతా! నీవు యిక్కడున్నవా? యీ రఘు మారాజు ఎప్పుడొచ్చిండు?' అంట అడ్గుతుంటే అప్పుడు సీత,

ఆc! నేను వొచ్చుడు వో గడిసేపు! అల్లాం అయింటె, రఘు మారాజు పనిపఃర్ల కాడికొచ్చేది' అంటూ చెప్పింది, ముగ్గురూ నవ్వుకుంటూ కోటలో ప్రవేశించి ఆ కోట విశేషాలన్నీ కళ్లారా తనివి తీరా చూశారు.

ఆ కోట నిర్మాణం అత్యద్భుతం. కానీ, చంద్రుడిలో మచ్చలా, సర్వభద్రతలతో నిర్మింపబడ్డ ఆ కోటలో పలి రాజప్రాంగణం, అంటే సభామండప స్థానంలో సరిగ్గా పదికోసుల దూరంనుండి విడిచిన బాణం వచ్చి పడిందట! అది అపశకునంగా భావించిన పాలకులు యీ కోటను విడిచి మరో చోట కోట కావించుకున్నారు. ఈ కోట పనితనం, దాని సొగసు చూచి తీరవలసిందే!

ఇన్ని విచిత్రాలు చూచి ఆ యిద్దరు కన్నెపిల్లలు వెంట రాగా రఘు ఇల్లు చేరాడు.

ఇల్లు చేరిన తరువాత రఘు వెంటనే ఎదో అత్రమైన పనివున్నట్లు పరంధామయ్యగారి యింటికి వెళ్లాడు. ఆనాడు జానకీ, సీతలు యిద్దరూ 'యీ రఘు నా స్నేహితురాలికి భర్త అయితే ఎంత బాగుండును? అంటూనే ఆలోచించారు, కానీ తమ కొరకు మాత్రం అందరాని పండుగా భావిస్తూ ఏ కోరికకూ చోటివ్వలేదు.

అప్పుడే స్వామిని సేవించి యింటికి తిరిగి వచ్చి భోజనానికి లేవబోతున్న పరంధామయ్య దృష్టిపథంలో రఘుపడగానే అనిర్వచనీయమైన ఆనందం ఏదో పరంధామయ్యను అలుముకున్నది. సద్దుమణిగిన కోరిక రెపరెపలాడుతూ తన ఎదలో సందడి చేయడం ప్రారంభించింది.

నవ్వు ముఖంతో ' ఏం బాబు? యిలా వచ్చావ్?' అన్నాడు.

రఘు, సవినయంగా, తాను, సీతను వివాహం చేసుకోదలచి వో నిర్ణయానికి వచ్చినట్లు తనకు పెళ్లి పెద్దగా నిల్చుండి రామయ్యగారితో సంప్రదింపులు జరుపాల్సిందిగా కోరాడు.

ఆ మాట విన్న పరంధామయ్య వో లిప్తకాలం త్రుళ్లిపడ్డంత పని కాగా

సంభాళించుకుని సర్వం దైవేచ్ఛ అంటూ, అప్పటికప్పుడే రామయ్యగారింటికి నడిచి,

రామయ్యా! పప్పన్నం త్వరలో పెట్టిస్తావని పెళ్లిపెద్దగా నీ యిల్లు తొక్కుతున్నాను. మా రఘుకు, సీతను అడగొచ్చిన. ఏమంటావ్?' అన్నాడు.

రామయ్య తన చెవులను తానే నమ్మలేక, 'అంత అదృష్టం సీతకెక్కడిది? మన జానకమ్మ తల్లికి ఖాయం చేయుండి' అన్నాడు.

'అది సరేనయ్యా! ఇద్దరూ నాకు బిడ్డలే! చిన్నదాని మురిపెం తొల్త తీరని. పిల్లవాడు సీతను కోరుకున్నాడు. 'దైవ ఘటన! కాదనడానికి మనమెవ్వరం?' అన్నాడు.

ఆ మాట విని రామయ్య, అన్నా! నీదెంత పెద్ద మనస్సు? నీ మాటను ఏనాడన్నా కాదన్నానా? అంటూ సీతను పిలిచి పరంధామయ్య గారికి పాదాభివందనం చేయించాడు. పరంధామయ్యగారు చక్కెర తెప్పించి యిద్దరికీ పెట్టి ఆశీర్వదించాడు.

తథాస్తు దేవతల్లా గుళ్లో ఎవరో గంటలు మ్రోగించారు.